కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన రాజ్‌కుమార్

రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 5 : బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన జాగిరి రాజ్‌కుమార్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. యాదవ కులానికి చెందిన రాజ్‌కుమార్ దేహదారుఢ్య పరీక్షకు నిత్యం 4 నుంచి 5 గంటలు సాధన చేశారు. చివరి పరీక్షకు శిక్షణ తీసుకుంటూ రోజుకు దాదాపు 7 గంటలు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. రాజ్‌కుమార్ పోలీస్ ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రా మస్తులు గురువారం అభినందించారు.

టీఎస్ఎస్‌పీకి యువకుల ఎంపిక

మహదేవపూర్, అక్టోబర్ 5 : మండల పరిధిలోని సూరారానికి చెందిన నాగుల మహేశ్, ఎడపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మోతే పవన్ కల్యాణ్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, యువత అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై సంతోషంగా ఉందని, శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించామని పవన్, మహేశ్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గణపురం, అక్టోబర్ 5 : మండలంలోని సీతారాంపురం గ్రామంలో కల్యాణలక్ష్మి చెక్కులను భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొలుసాని లక్ష్మీనర్సింహరావు గురువారం లబ్ధిదారులైన జూకంటి శంకరమ్మ, డీ సుజాత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డలకు అందించే దసర కానులను (చీరలను) అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామంచ భద్రయ్య, ఎంపీటీసీ మంద అశోక్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి మోతె కర్ణాకర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు వైనాల వెంకటేశ్, ఆర్ఐ దేవేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నీలయ్య, యూత్ అధ్యక్షుడు గుండు సుభాష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ నర్సింహస్వామి

పలిమెల, అక్టోబర్ 5: మహిళలు తమ జీవనోపాధిని మెరుగు పరుచుకుని ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ నర్సింహస్వామి సూచించారు. గురువారం మండలంలోని లెంకలగడ్డ గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుణాలు పొందిన స్వయం సహాయక సఘాలను పరిశీలించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుణాలు పొందిన కిరాణ దుకాణాలు, బట్టల దుకాణలు, తదితర దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం వాటర్‌షెడ్ డెవలప్ మెంట్, అస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమం, బ్యాంక్ లింకెజ్‌లపై వీవోఏలకు అవగాహన కల్పించారు. అడిషనల్ పీడీ సురేశ్, జిల్లా ఏపీఎం వినేశ్ రావు, డీపీఎం అంజయ్య, ఏపీఎం రవికుమార్, సీసీ స్వామీ, ఎంఎస్ఏ సింధు, వీవోఏలు పాల్గొన్నారు.

చదువు మధ్యలో మానేసిన పిల్లలకు అండగా జయశంకర్ ఫౌండేషన్

మహదేవపూర్, అక్టోబర్ 5 : నిరుపేద కుటుంబాలకు చెందిన చదువు మధ్యలో మానేసిన విద్యార్థులకు జయశంకర్ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని చైర్మన్ ఏ మారుతీ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులకు, వివిధ రకాల కారణాలతో చదువు మధ్యలో మానేసిన పిల్లలకు ఫౌండేషన్ ద్వారా పరీక్షా ఫీజు చెల్లించలేని వారికి ఓపెన్ టెన్త్ పరీక్ష ఫీజు తామే చెల్లించి చదివిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ నెల 12లోగా విద్యార్థులు ఫౌండేషన్ ను సంప్రదించాలని సూచించారు. వివరాలకు ఫోన్‌నంబర్ 9391075767ను సంప్రదించాలన్నారు.

దసరా క్రికెట్ టోర్నమెంట్ సన్నాహక సమావేశం

మహదేవపూర్, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో దసరా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణపై క్రీడాకారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. శారీరక మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. యువకులు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, సాగర్ల రాజు, శీలం లక్ష్మణ్, పవన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీ బరాజ్‌కు తగ్గిన వరద

మహదేవపూర్, అక్టోబర్ 5 : మండల పరిధిలోని అంబట్‌పల్లిలోని లక్ష్మీ బరాజ్‌కు వదర ప్రవాహం తగ్గింది. బరాజ్ ఇన్‌ఫ్లో బుధవారం 1,29,850 క్యూసెక్యుల వరద ప్రవాహం రాగా, గురువారం బరాజ్ ఇన్‌ఫ్లో 1,01,500 క్యూసెక్యులకు తగ్గింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నట్లు భారీ నీటిపారుదల శాఖ డీఈఈ సురేశ్ తెలిపారు. బరాజ్ ప్రస్తుత నీటి మట్టం 2,40 మీటర్లుగా ఉందని ఆయన వెల్లడించారు.

లక్ష్మీ బరాజ్‌లో వరద

కాటారం : బతుకమ్మ చీరెలను అందజేస్తున్న సర్పంచ్

తాడ్వాయి : సర్పంచ్‌లకు చీరెలను అందజేస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

మహిళలకు సర్కారు కానుక బతుకమ్మ చీరె

గ్రామాల్లో ఆడబిడ్డలకు చీరెలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

టేకుమట్ల, అక్టోబర్ 5 : సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ఆడబిడ్డలకు కానుకగా చీరెలను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండంలోని రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి, దుబ్యాల, మందలోరిపల్లి, గుమ్మడవెల్లి, బండపల్లి, కుందనపల్లి. వెల్లంపల్లి, ఎంపేడు గ్రామాల్లో ఎంపీపీ, తిరుపతిరెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరెలను, యువకులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో అనిత, సర్పంచ్‌లు చదువు మధుర, సుజాత, నర్సింహరెడ్డి, ఉమేందర్‌రావు, రాజయ్య, రాజేందర్, కోమల, రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ చీరెల సందడి కనిపిస్తున్నది. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వెళ్లి చీరెలను అందజేస్తున్నారు. అంకుషాపూర్ గ్రామంలో సర్పంచ్ ఐలి సుమలత రాజబాబు, ఎంపీటీసీ రూప ఊసింగ్ గురువారం మహిళలకు చీరెలను అందజేసి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గోవిందరావుపేట: పస్రాలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామంలో గురువారం బతుకమ్మ చీరెలను ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ కానుకగా చీరెలు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరెలను తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్ పంపిణీ చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చీరెలు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకోగా, గురువారం ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అందించారు. నేటి నుంచి మహిళలకు చీరెలను పంపిణీ చేయాలని సూచించారు.

ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 5 : ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల, మైనార్టీ పాఠశాల, జంగేడు కేజీబీవీ, భూపాలపల్లి ఆశ్రమ పాఠశాలలను విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించి గురువారం నుంచి ప్రారంభమైన ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఈవో వెంట సహాయ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరిశీలిస్తున్న డీఈవో రాంకుమార్

ఇంటర్ అడ్మిషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి దేవరాజం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 5 : జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందడానికి దరఖాస్తు గడువును పొడిగించడం జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి దేవరాజం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 5, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 5, మోడల్ స్కూల్స్, కస్తూర్బా స్కూల్స్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఎంజేపీ స్కూల్స్ 25, మొత్తం జిల్లాలో 35 జూనియర్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా అక్టోబర్ 9వ తేదీ వరకు ప్రవేశాలు పొందవచ్చన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి అలస్య రుసుం రూ.1000 చెల్లించి అడ్మిషన్ పొందాలని వెల్లడించారు. ఈ చివరి అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

కాటారం, అక్టోబర్ 5: మండలంలోని గంగపురి, అంకుషాపూర్ గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ గుర్తించి మందులను పంపిణీ చేశారు. అలాగే గర్భిణులను పరీక్షించి, కాన్పు కోసం ప్రభుత్వాసుపత్రిలో చేయించుకుని ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో లబ్ధి పొందాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మౌనిక, వైద్యులు శ్రావణి, ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఏఎన్ఎం రజిత ఉన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

7న ఉత్సవ కమిటీ ఎన్నిక

ములుగురూరల్, అక్టోబర్ 5 : జిల్లా కేంద్రంలోని దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో రావణ వధ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నగరం రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఈ నెల 7న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని బొడ్రాయి వద్ద సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

కన్నాయిగూడెం, అక్టోబర్ 5: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో రెండు సీసీరోడ్లను రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య గురువారం ప్రారంభించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి వాసంపల్లి రామయ్య ఇంటి వరకు ఒకటి, వాసంపల్లి లక్ష్మీనారాయణ ఇంటి వరకు మరోటి రెండు కలిపి 10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి చేపడుతున్నట్లు తెలిపారు. కన్నాయిగూడెం సర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూజారి సత్యనారాయణ, గ్రామాధ్యక్షుడు శోబన్, బాబు పాల్గొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అశోక్

ములుగురూరల్, అక్టోబర్ 5 : తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కే అశోక్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బీ యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన అశోక్‌కు శుక్రవారం నియమాకపత్రాన్ని అందజేశారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ ములుగు మండలం జంగాలపల్లికి చెందిన అశోక్ గౌడ కులస్తుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి, ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి తన వంతుగా కృషి చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ గౌడ్, నాయకులు మోహన్‌గౌడ్, కుమార్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, సదానందంగౌడ్, శ్యామ్‌గౌడ్ ఉన్నారు.